# క్యాజువాల్టీ కథలు: డాక్టర్ రవూఫ్



మధ్యాహ్నం మూడూ, మూడున్నర ప్రాంతం. క్యాజువాల్టీ ఖాళీగా వుంది. నేనూ, క్యాజువాల్టీ మెడికల్ ఆఫీసర్ (సి.ఎం.ఓ.) పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నాం. ఉన్నట్టుండి క్యాజువాల్టీ ముందు కలకలం, హడావుడీ! ఓ నలుగురు రక్తమోడుతున్న ఒక పేషెంట్‌ని చేతుల్లో మోసుకొని తెచ్చారు.

"ఏమిటీ సంగతి?" అని ప్రశ్నించాను. కత్తితో తెగ్గోసుకున్నాడని చెప్పారు వాళ్ళు. స్కాల్ప్ మీద రెండు, మూడు కత్తి గాట్లు, పై పై గాయాలే! కానీ, రక్తం ఇంకా వస్తూనే వుంది.

నేనతని బి.పి. రికార్డ్ చేస్తూంటే,

"నా పద్మని పిలిపించండి. నేను చనిపోయేలోగా తనని చూడాలి" అంటూ, నా రెండు చేతులూ పట్టుకున్నాడు. అతని దగ్గర్నించి ఆల్కహాల్ వాసన గుప్పుమంటోంది.

"తాగి కత్తితో కోసుకున్నావా తలని" అంటే, "ఔనని" తలూపాడు.

సి.ఎం.ఓ. ఫస్ట్ ఎయిడ్ అయ్యేక - ఈ కేసుని మెడికో లీగల్ రిజిస్టర్‌లో ఎంటర్ చేస్తూ "ఎందుకు కోసుకున్నావ్?" అని అడిగారు.

"నా పద్మ నన్ను కాదన్నాక చచ్చిపోదామన్పించింది"

అతన్తో వచ్చిన అటెండెంట్స్‌ని ఆయన "ఎవరీ పద్మ?" అని అడిగారు.

ఆవిడొక విధవరాలనీ, కొంతకాలం దాకా ఇద్దరూ కలిసే వున్నారనీ, ఇప్పుడు ఆమె తనని కాదందని ఇలా చేసుకున్నాడని వాళ్ళు చెప్పారు.

పేషెంట్ ఇదేమీ పట్టించుకోవటం లేదు. "ఒక్కసారి నా పద్మని పిలిపించండి" అని మమ్మల్ని వేడుకొంటున్నాడు.

కబురుచేస్తే ఔట్ పోస్ట్ నించి పోలీసులొచ్చారు. వాళ్ళూ ప్రశ్నించారు - "ఎందుకు చచ్చిపోవాలనుకున్నావ్?" అని.

దానికి అతని సమాధానం అంతక్రితం మాకిచ్చింది కాదు. పోలీసుల్ని చూడగానే మాట మార్చేశాడు. "కడుపు నొప్పికి తట్టుకోలేక" అంటూ, నెత్తికెక్కిన ప్రేమా, నిషా రెండూ దిగిపోయి!

ప్రేమా, ఇష్క్, లవ్, ప్యార్ అన్నవాడూ, తను ప్రేమించిన ఆవిడ సానుభూతి కోసం కత్తితో తనని తాను గాయపర్చుకున్నవాడూ కాస్తా - "నాకేం తెలియదు బాబోయ్. నన్నొదిలేయండి" అంటూ భోరుమని ఏడ్వటం మొదలెట్టాడు.

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్